అల్లూరి సీతారామరాజు

దుకాణాల తొలగింపు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలం కేంద్రంలోని శనివారం నిర్వహిస్తున్న వారపు సంతల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా దుకాణాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ సతీష్ సూచించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను సిబ్బందితో తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వారపు సంతలో ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. సంతల్లో ఇరువైపులా అమ్మకాలు చేపడితే దుకాణాల ఏర్పాటుకు అనుమతించమని ఆయన హెచ్చరించారు. ట్రాఫిక్కు ఇబ్బంది లేకుండా సంత నిర్వహించాలని ఆయన సూచించారు. ఖాళీ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

దుకాణాలు తొలగిస్తున్న ఎస్ఐ

వినూత్న నిరసనల హోరు

పెదబయలులో ఒంటి కాలిపై నిలుచుని నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

అడ్డతీగలలో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె వినూత్న నిరసనలతో సాగింది. అల్లూరి జిల్లాలోని పలు చోట్ల వివిధ రూపాల్లో నిసనలు శనివారం కొనసాగించారు.

పెదబయలు :అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సమ్మె కొనసాగింది. చెవిలో పూలు పెట్టుకొని వినూత్నంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకురాలు టి.రాజమ్మ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అధికారం వచ్చిన వెంటనే జీతాలు పెంచకుండా మా చెవిలో పూలు పెట్టిందని విమర్శించారు. 12 రోజులుగా సమ్మె కొనసాగుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని, మంత్రులు తలోక మాట మాట్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, టి.రాజమ్మ, శాంతి, కొండమ్మ, వరహాలమ్మ, దేవి, శాంతి, మంగమ్మ పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మెకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.హైమావతి, అనంతగిరి జెడ్పిటిసి సభ్యులు దీసారి గంగరాజు, తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గం ఇన్చార్జ్ సివేరి దొన్నుదొర మద్దతు తెలిపారు. ముందుగా అంగన్వాడీ ఐసిడిఎస్ కార్యాలయం నుండి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టి మనోహరం నిర్వహించారు. అనంతరం జెడ్పిటిసి సభ్యులు గంగరాజు మాట్లాడుతూ, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేసి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గం ఇన్చార్జ సివేరి దొన్నుదొర మాట్లాడుతూ, జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్ ఇవ్వాలన్నారు. సెంటర్‌ల అద్దెలు, టిఎ బిల్లులు వెంటనే చెల్లించాలని, మెడికల్ లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం నేతలు కె.కొండమ్మ, డి.వసంతకుమారి, సిపిఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణరావు, గిరిజన సంఘం నాయకుడు నరాజీ సురేష్, జనసేన అరకు నియోజకవర్గ ఇన్చార్జ్ చిరంజీవి, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శెట్టి లక్ష్మణుడు, మండలధ్యక్షులు తులసిరావు, సీనియర్ నాయకులు బొడ్డ శ్యాంసుందర్, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసు బాబు, తాడేపూట్ సర్పంచ్లు సోమేల లక్ష్మయ్యచ బొంజన దొర, పాడి బాలన్న, మాజీ సర్పంచ్ శతక బొంజుబాబు, అరకు అసెంబ్లీ అధికార ప్రతినిధి లక్ష్మి పాల్గొన్నారు.

ముంచంగిపట్టులో చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన

అరకులోయ రూరల్:అంగన్వాడీలు చెవిలో పువ్వులు పెట్టి నిరసన తెలియజేశారు. ఈ సమ్మెకు అరకువేలి సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ. వైసీపీ ప్రభుత్వం అధకారంలోకి వస్తే అంగన్వాడి అక్క చెల్లమ్మలకు తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా జీతాలు పెంచుతామని మాయమాటలు చెప్పి తీవ్రంగా మోసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా అధ్యక్షురాలు డి.నాగమ్మ, మండల అధ్యక్షురాలు పాంగి వెంకట్‌లక్ష్మి, కార్యదర్శి కొర్రా లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు డి.నాగమ్మ, రాధ భారతి, నిర్మల, సీత, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో కోలాటం

ముంచంగిపుట్టు : స్థానికంగా అంగన్‌వాడీలు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. వారి పోరాటానికి ఆదివాసీ మాతృభాషా విద్యావాలంటీర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.చంద్రయ్య, కె.కొండయ్య మద్దతు తెలుపుతూ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, సిపిఎం మండల కార్యదర్శి భీమరాజు, ఎంఎం.శ్రీను, కె.నర్సయ్య, ఉపసర్పంచ్ వి.గణపతి, ప్రకాష్, చిన్నయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు కాంతమ్మ, మౌళమ్మ, కళ, భవాని పాల్గొన్నారు.

ఒంటికాలుపై అంగన్వాడీల నిరసన

రాజవొమ్మంగి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన రాజవొమ్మంగి మండల కేంద్రం ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా అంగన్వాడీలు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు శిబిరంలో ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు గిరిజన సంఘం నాయకులు, పి.రామరాజు, కె.సూరిబాబు, తెడ్ల అబ్బాయి, సిహెచ్.ధర్మరాజు , యూనియన్ నాయకురాలు కె.వెంకటలక్ష్మి, సిహెచ్.కుమారి, ఎల్ సత్యవతి, కె లక్ష్మి, చిన్నమ్ములు, రమణి, రమణ, రత్నం, రాజేశ్వరి, మంగ,రాధ పాల్గొన్నారు.

అరకులోయలో....

సీలేరు : జీకే వీధి మండలం కేంద్రంలో అంగన్వాడి వర్కర్లు ఆందోళన కార్యక్రమం 12వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు అల్లూరి జిల్లా సహాయ కార్యదర్శి గడుతురు సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కోలాటం ఆడి నిరసన

కొయ్యూరు : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీల 12వ రోజు ఆందోళన సందర్భంగా అంగన్వాడీలు శిబిరం వద్ద ఆట పాట, కోలాటం ఆడి నిరసన తెలిపారు. వీరికి ఆందోళనకు సిపిఎం పార్టీ జిల్లా నాయకుడు ఎస్.సూరిబాబు మద్దతు తెలిపారు.

పచ్చిగడ్డి తింటూ...

అడ్డతీగల : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 12 రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు, శనివారం దీక్షా శిబిరంలో మోకాళ్లపై నిల్చుని, పచ్చగడ్డి తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ నాయకురాలు బి.నిర్మల, బేబీ రాణి, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

భిక్షాటన

మోతుగూడెం:చింతూరు మండలం, మోతుగూడెంలో శనివారం అంగన్వాడీ కార్యకర్తలు భిక్షాటన చేశారు. ప్రతి దుకాణానికి వెళ్లి తమ సమస్యల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తెలియజేస్తూ ఈ భిక్షాటన చేశారు. డొంకరాయి ఎంపీటీసీ కరక రమణ, మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు.

టిడిపి జనసేన మద్దతు

రంపచోడవరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీ వర్కర్లు చేపట్టిన నిరసన దీక్షలు 12వ రోజు కొనసాగాయి. ఈ దీక్షా శిబిరాన్ని శనివారం రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, జనసేన నాయకులు కుర్ల రాజశేఖర్ రెడ్డి, ఆయా పార్టీల నాయకులు సందర్శించి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయుకలు కె రామలక్ష్మి, కె.సింగారమ్మ, వి.సత్యవేణి, టిడిపి నాయకులు కారం సురేష్ బాబు, జనసేన నాయకులు పాపోలు శ్రీనివాస్, చక్రపాణి, నాగు, పండు, గళ్ళ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల యూనియన్ మద్దతు

విఆర్.పురం : మండల కేంద్రం రేఖపల్లిలో అంగన్వాడీల ఆందోళన 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రంపచోడవరం న్యాయవాదుల యూనియన్ నాయకు.లు రవితేజ అంగన్వాడీల ఆందోళనకు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ, నాగమణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల సరుకులు పోతే ప్రభుత్వానిదే బాధ్యత

మారేడుమిల్లి : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన 12వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా మండలంలో పలు చోట్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి ఓపెన్ చేశారని, అంగన్వాడీ కేంద్రాల్లో వస్తువులు ఏమైనా పోయినట్లయితే వాటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మారేడుమిల్లి పోలీస్ స్టేషన్లో అంగన్వాడీలు శనివారం ఫిర్యాదు చేశారు. యూనియన్ జిల్లా నాయకురాలు రామలక్ష్మి పాల్గొన్నారు.

హుకుంపేటలో సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు, టిడిపి నేతల మద్దతు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ

అంగన్వాడీల బ్యానర్లు తగలబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -సీలేరు

అంగన్వాడీ యూనియన్ బ్యానర్లు తగలబెట్టిన దుండగులపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు తమ సమస్యలపై ఉద్యమాలు చేపడుతున్న తరుణంలో యూనియన్, సిఐటియు జెండాలు, బ్యానర్లను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారని తెలిపారు. దీనిపై జీకే వీధి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పోలీసులు తక్షణమే దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి అప్పల నరసయ్య, నాయకులు దయ, వెంకటి పాల్గొన్నారు.

డిఎవిలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ జెన్కో ఈఈ ప్రభాకర్, ఏడిఈ అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కుల మతాలకు అతీతంగా ఈ వేడుకల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓం నమశివాయ మాట్లాడుతూ ఏసుక్రీస్తు గొప్ప సంఘసంస్కర్త అని, ఆయన లోకానికి చేసిన సేవలను కొనియాడారు. ఐదో తరగతి విద్యార్థి సాత్విక్ శాంత్ క్లాస్ వ్యాసదారణ ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శించిన వేషధారణలను ఉపాధ్యాయులు తిలకించి అభినందించారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

సమీక్షా సమావేశంలో ఐటిడిఎ పిఒ చైతన్య

ప్రజాశక్తి-చింతూరు

పాఠశాలల వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రధానోపాధ్యాయులను చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య ఆదేశించారు. చింతూరు డివిజన్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పిఒ చైతన్య శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం, వసతి గృహాల్లో మెనూ సక్రమంగా నిర్వహించాలని, లేకుంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వార్త పత్రికలలో పాఠశాల సంబంధిత వార్తలొస్తే వాటికి సంబంధిత ఎంఈఒ, ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహిస్తూ వివరణ ఐటిడిఏ కార్యాలయానికి ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు రోల్ మోడల్‌గా ఉంటూ పాఠ్యాంశాలు బోధించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు యాప్‌లో సమయపాలన ప్రకారం నమోదు చేయాలని లేని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జగనన్న విద్య కానుకలకు ఆన్లైన్ పూర్తి చేయాలన్నారు. పదవ తరగతి ఫలితాల్లో గత సంవత్సరం తక్కువగా వచ్చాయని, ఈ సంవత్సరం మొదటి విడతలోనే 100శాతం ఫలితం సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఒకటి నుండి పదవ తరగతి విద్యార్థులకు రెమిడీయల్ తరగతులు నిర్వహించాలన్నారు. సమీక్ష సమావేశానికి పంపించు సమాచారం తప్పులు లేకుండా స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. నాడు-నేడు నిధులు, స్కూల్ మెయింటినెన్స్ ఫండ్స్ సక్రమంగా ఉపయోగించాలని సూచించారు. విద్యార్థులందరికీ హెచ్ఐవి రక్త పరీక్షలు నిర్వహించి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీవో కె.సుజాత, సత్యనారాయణ రెడ్డి, సీఎంఓలు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య

మెడల్స్, సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు, చిత్రంలో పాఠశాల ఉపాధ్యాయులు

జోనల్ మీట్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి రంపచోడవరం

ఏలూరు జిల్లా జీలుగుమిల్లిలో ఈ నెల 20 నుండి 22 వరకు జరిగిన గిరిజన గురుకుల సొసైటీ పాఠశాలల 2వ జోనల్ మీట్ ఆటల పోటీల్లో రంపచోడవరం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు పి.చరణ్ 400 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, కె.రాహుల్ లాంగ్ జంప్‌లో ప్రథమ, హైజంప్‌లో తృతీయ స్థానం, సిహెచ్.అఖిల్ కుమార్ 200 మీటర్లు పరుగు పందెంలో ద్వితీయ, 100 మీటర్లలో తృతీయ, లాంగ్ జంప్‌లో తతీయ స్థానం, కె.నాగచైతన్య హైజంప్‌లో ద్వితీయ స్థానం, ఎం.ప్రవీణ్ 800 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, బి.సిద్ధార్థ 1500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, కె.సాయి తేజ 200 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం, 4ఐ 400 మీటర్లు రిలే పరుగు పందెం ప్రథమ స్థానం సాధించారు. వ్యక్తిగత ఛాంపియన్ షిప్‌లో పి. చరణ్ విజయం సాధించి ఆల్ రౌండ్ ఛాంపియన్ షిప్‌ను గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె.అహ్మద్ అలీషా, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ప్రసాద్, పిడి డి.ప్రసాదరాజు, పిఈటి వి.చిన్నయ్య అభినందించారు.

'ఆడుదాం ఆంధ్ర'పై ర్యాలీ, మానవహారం

మానవహారం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలో ఈ నెల 26 నుండి జరగనున్న ఆడదాం ఆంధ్రా కార్యక్రమంపై అవగాహన కోసం మండలంలో వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు భారీ ర్యాలీగా నిర్వహించి, మానవహారం చేయడం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎ. వీర కిశోర్ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం సంబంధించి వివిధ రకాల క్రీడలు నిర్వహించబడతాయని తెలిపారు. మండలంలో ఈనెల 26 నుండి సచివాలయ స్థాయి నుండి వాలీబాల్, కబడ్డీ, కోకో, క్రికెట్, షటిల్ క్రీడలు నిర్వహించబడతాయని 15 సంవత్సరాలు పైబడిన విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. సచివాలయ పరిధిలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, రాష్ట్రస్థాయి క్రీడలలో పాల్గొనవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తమ్మారావు, పరిపాలన అధికారి పి జయంతి, పంచాయతీ కార్యదర్శి పి విజయ్ కుమార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వివిధ పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా విద్యార్థిని విద్యార్థులు యోగ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని పెద్దమట్టపల్లి గ్రామ పంచాయితీ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపిటీసీ ప్రదీప్ కుమార్, స్థానిక సర్పంచ్ వెట్టి లక్ష్మి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు తమ వరి ధాన్యాన్ని ఈ కేంద్రానికి తీసుకొచ్చి విక్రయించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎక్కువగా ఏర్పాటు చేయాలని, తడిచిన ధాన్యాన్ని సైతం రైతుల వద్ద నుండి కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిటీసీ ప్రదీప్ కుమార్, సర్పంచ్ లక్ష్మి

నూతన భవనం పరిశీలన

భవనాన్ని పరిశీలిస్తున్న జెఇ, తహసిల్దార్,

ప్రజాశక్తి హుకుంపేట: నూతనంగా నిర్మిస్తున్న తహసిల్దార్ కార్యాలయాన్ని ట్రైబల్ వెల్ఫేర్ జెఇ ధృవకుమార్, తహసిల్దార్ రాజ్యలక్ష్మి శనివారం సందర్శించారు. నూతనంగా నిర్మించిన గదులను, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం జెఇ ధవకుమార్ మాట్లాడుతూ, నాణ్యత ప్రమాణాలు పాటించి ధృఢంగా నిర్మించామన్నారు.వారం రోజులలో ప్రారంభం కానున్న సందర్భంగా పెండింగ్ వర్కులను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కొండబాబు, సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుందర్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

అవగాహన ర్యాలీ చేపడుతున్న అధికారులు

ప్రజాశక్తి- అనంతగిరి: మండల కేంద్రంలో ఓటు హక్కుపై తహసిల్దార్ రాంబాయి ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాలలో ప్రారంభమైన ర్యాలీ మూడో రోడ్ల కూడలి వద్దకు చేరింది. అనంతరం మానవహారం గా ఏర్పడి ఓటు హక్కుపై చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ, 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటర్‌గా నమోదు చేసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శంకరరావు, కళాశాల లెక్చరర్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు

ప్రశాంతంగా గీతం ఎంబిఎ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -మధురవాడ :గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబిఎ కోర్సులలో ప్రవేశానికి జి-బాట్ -2024 పేరిటి జాతీయస్థాయి ప్రవేశ పరీక్షను శనివారం ప్రశాంతంగా నిర్వహించారు. విశాఖతో సహ దేశంలోని వివిధ రాష్ట్రాలలో అనూహ్య స్పందన లభించిందని బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. రెండేళ్ళ కాల వ్యవధి గల గీతం ఎంబిఎ కోర్సులో ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సు, ఆపరేషన్స్, బిజినెస్ అనలిటిక్స్, ఇంటర్నేషనల్ బిజినెస్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్లను ఆఫర్ చేస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష క్యాట్-2024లో ఉత్తీర్ణత సాధించిన వారు ప్రవేశాలకు నేరుగా ధరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ప్రతిభ గల విద్యార్థులకు, క్రీడాకారులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లను అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు.

హైడ్రోపవర్ ప్రాజెక్ట్‌పై సిఎం ప్రకటన చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన

చింతపల్లిలో నిరసన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-చింతపల్లి: హైడ్రో పవర్ ప్రాజెక్టుపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైఖరిని బయట పెట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. శనివారం చింతపల్లిలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు, గిరిజనులతో కలిసి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి ఆధ్వర్యాన భారీ ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చింతపల్లిలో జరిగిన సభలో జగన్మోహన్ రెడ్డి గిరిజనుల ఆశలు అడియాసలు చేశారని, సమస్యల పరిష్కారంపై ఎక్కడా ప్రసంగంలో కానరాలేదని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో హైడ్రోపవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని తీర్మానం చేసిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అనేక దఫాలుగా ఈ ప్రాంత వాసులు నిరసనలతో వ్యతిరేకించారని తెలిపారు. అటువంటిది ఈ సభలో హైడ్రోపవర్ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి స్పందిస్తారేమోనని వేచి చూసిన ప్రజలకు అసంతృప్తి మిగిలిందన్నారు. ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి తన వైఖరిని స్పష్టం చేస్తూ బహిరంగంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. జీవో 3 రద్దుతో గిరిజన నిరుద్యోగ యువత అన్యాయమైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హైవే నిర్మాణంతో అనేకమంది గిరిజనులు భూములు, ఇల్లు కోల్పోయారని నేటి వరకు చాలామందికి నష్ట పరిహారం ఇవ్వకుండా పనులు మాత్రం కొనసాగిస్తున్నారని, దీనిఐ ఏ మాత్రం ఉపేక్షించేది తేల్చి చెప్పారు.హైవే బాధితులకు నష్టపరిహారం 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, ఒక్కో కుటుంబానికి ఐదు లక్షలు ఇల్లు నిర్మాణంకు నిధులు ఇవ్వాలన్నారు. ఇలా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న గిరిజనులకు జగన్మోహన్ రెడ్డి ఏమాత్రం ఉపయోగం లేని ప్రసంగం చేసి తన రాజకీయ ప్రత్యర్థులను విమర్శించే మాటలతో ముగించారని విమర్శించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం కమిటీ సభ్యులు సింహాచలం, మజ్జి రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, పాంగి జీవన్, కృష్ణ పాల్గొన్నారు.

పెదబయలు: గిరిజన ప్రాంతంలో సంపదను సీఎం బై జ్యూస్ కంపెనీకి కట్టబెట్టడానికే పర్యటించారని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా పూర్వ అధ్యక్షులు బొండా సన్నిబాబు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ విమర్శించారు. మండలకేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగున్నర సంవత్సరాల కాలం తర్వాత గిరిజన ప్రాంతంలో పర్యటించి ముఖ్యమంత్రి గిరిజనులకు ఏ మేలు చేయలేదన్నారు. గిరిజన సమస్యలపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. జీఓ 3కు చట్టబద్ధత కల్పించి, వందకు వంద శాతం గిరిజనులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు బొండా గంగాధరం, రామారావు పాల్గొన్నారు.

పెదబయలులో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన

1 నుంచి సర్పంచ్‌ల శంఖారావం

- పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి- సీతమ్మధార : పంచాయతీల పరిధిలోని 16 డిమాండ్ల సాధనకు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల శంఖారావం పేరిట ఉద్యమిస్తామని ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్ అన్నారు శనివారం విశాఖ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మీడియాతో మాట్లాడుతూ, వైసిపి పాలనలో గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయన్నారు. కేంద్రం ఇచ్చే ఆర్థికసంఘం, ఉపాధి హామీ నిధులను దారి మళ్లించి పంచాయతీలను నామమాత్రం చేశారని ఫిర్యాదుపై విచారణలో వాస్తవమేనని స్పష్టమైనా, రాష్ట్రానికి మూడు నెలల క్రితమే నోటీసులిచ్చినా స్పందన లేదన్నారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు సమాంతరం సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారని, ఇపుడు గృహసారథులు, కన్వీనర్లతో చట్ట, రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు సిఎం జగన్ ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. రాష్ట్రంలో 12,918 గ్రామ పంచాయతీల్లో తాగునీరు, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించలేని దయనీయ స్థితిలో సర్పంచ్‌లు ఉంటే, పంచాయతీరాజ్‌మంత్రి బూడి ముత్యాలనాయుడు డమ్మీగానే వ్యవహరిస్తున్నారే తప్ప, తమ శాఖకు సంబంధించి ఎటువంటి పనులు చేయడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో సర్పంచుల సత్తా ఏంటో వైసిపి ప్రభుత్వానికి చూపిస్తామని రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు, ఉపాధ్యక్షుడు వై.వినోద్‌రాజు, నాయకులు ఎ.రామకృష్ణ, నాగరాజు, ముత్యాలరావు, ధనుంజయరావు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ప్రజలను నిరాశ పరిచిన

యువగళం బహిరంగ సభ

ప్రజాశక్తి- మాధవధార : పోలిపల్లిలో నిర్వహించిన తెలుగుదేశం యువగళం బహిరంగసభ, నేతల ఉపన్యాసాలు ఉత్తరాంధ్ర ప్రజలను తీవ్రంగా నిరాశపరిచాయని ఎపి స్టేట్ కాంగ్రెస్ ఒబిసి విభాగం ఛైర్మన్ మూల వెంకటరావు అన్నారు. ఎపి పునర్విభజన హామీలైన ప్రత్యేకహోదా, విశాఖ రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, వాల్తేరు రైల్వే డివిజన్ రద్దు చేసి ఒడిశాకు తరలింపు వంటి ఉత్తరాంధ్రకు సంబంధించి ప్రధాన సమస్యలను యువగళం సభలో ముఖ్యనేతలు, మేధావులు ప్రస్తావించకపోవ డం గర్హనీయమన్నారు.

విశాఖ మెట్రో రైల్, పోలవరం ప్రాజెక్టు, కేంద్ర విద్యాసంస్థల నిర్మాణాలు వంటి కేంద్రం నుంచి రావాల్సిన ఎన్నో ప్రయోజనాలకు మోక్షం లేకున్నా, బిజెపి విధానాలతో ఉత్తరాంధ్రకు తీవ్ర నష్టం జరుగుతున్నా ప్రతిష్టాత్మక యువగళం సభలో వీటి ఊసే లేకపోవడం దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, అన్నింటినీ నెరవేరుస్తామని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ, ఎపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చెప్పారన్నారు. ఇప్పటికైకా ఉత్తరాంధ్రకు న్యాయం చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

7 కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం

గంజాయి నిందితుడితో పోలీసులు

ప్రజాశక్తి- చింతపల్లి: చింతపల్లి- లోతుగడ్డ బ్రిడ్జి సమీపంలో అక్రమంగా గంజాయి రవాణా అవుతుందని పోలీసులకు ముందుగా సమాచారం అందింది. దీంతో, లోతుగడ్డ బ్రిడ్జి వద్ద కాపు కాసిన అన్నవరం పోలీసులు ద్విచక్ర వాహనంపై వస్తున్న రాజారావును ప్రశ్నించారు. అతడి వద్ద నుంచి ఏడు కేజీలకు పైగా లిక్విడ్ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్క ప్యాకెట్ నుంచి లక్ష రూపాయలకు సంపాదించినట్లు నిందితుడు తెలిపారు. ఏడు కేజీల గంజాయితో దొరికి నట్లు చింతపల్లి అడిషనల్ ఎస్పీ శివ కిషోర్ చెప్పారు

ట్రాఫిక్ చిక్కులు

ఘాట్ రోడ్డులో గంటల తరబడి రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-అనంతగిరి: మన్యం అందాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున పర్యాటకులు తరలి రావడంతో ఘాట్ రోడ్డుతో పాటు ప్రముఖ పర్యాటక బొర్రా, కటికి, చిటంపాడు జలపాతాలు, డమ్మకు జనసందోహంతో కిటకిటలాడాయి. ఆదివారం సెలవు దినం కావడంతో ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది తరలి వచ్చారు

ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 వాహనం

ముంచింగి పుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగే వారపు సంతలో వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో నాలుగు రోడ్ల కూడలి వద్ద 108 వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకుంది. 108 వాహనం ఆటోలు, జీపులు, బొలెర మధ్య నిలిచి పోయింది. ఆటోలు, జీపులు, నాలుగు రోడ్ల కూడలిలో ఇరువైపులా నిలుపుదల చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ప్రస్తుతం పోలీస్‌లు జరిమానాలు విధించక పోవడంతో అత్యవసర వాహనాలను సైతం లెక్కచేయకుండా ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

28, 29 తేదీల్లో బయోచిమికా వర్క్‌షాప్

ప్రజాశక్తి- విశాఖపట్నం: ఎయు బయోకెమిస్ట్రీ విభాగంలో ఈనెల 28, 29 తేదీల్లో 'క్వాట్ బయోచిమికా-2కె23 అండ్ కాట్ ' రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఎయు ఇన్‌ఛార్జి విసి కె.సమత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య పి.సుభాషిణి దేవి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో ఇమ్యునాలజీ, జెనెటిక్ ఇంజినీరింగ్, బయోకెమికల్ టెక్నిక్‌లలో శిక్షణనిస్తారన్నారు. రీసెర్చ్ స్కాలర్‌లు, పిజి, యుజి ఫైనలియర్ విద్యార్థులు వర్క్‌షాప్‌కు హాజరు కావాలని కోరారు.

అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కోవిడ్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఏరియా ఆసుపత్రిలో కోవిడ్‌పై అవగాహన కార్యక్రమం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కోవిడ్ లక్షణాలు ఎలా ఉంటాయి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ కె లక్ష్మి, డాక్టర్స్, హాస్పిటల్ స్టాఫ్, నాన్ మెడికల్ స్టాఫ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్స్‌పో ప్రారంభ వేడుకలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

అట్టహాసంగా క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గాదిరాజు ప్యాలెస్ వేదికగా మూడు రోజులుపాటు తలపెట్టిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో 9వ ఎడిషన్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. శనివారం మధ్యాహ్నం విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారిలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రాంభించారు. ఈ సందర్భంగా ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావం, నాణ్యతతో సేవలు అందజేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని అన్నారు. విశాఖ నగరానికి ప్రపంచ పటంలో విశిష్ట స్థానం ఉందని తెలిపారు. అందుకే ఎన్ఆర్ఐలు, సాఫ్ట్‌వేర్ అధికారులు నగరంలో ఇళ్ళ కొనడానికి, ఇక్కడ పెట్టుబడి పెట్టడానికి ఇష్టపడుతున్నారని చెప్పారు. మేయర్ హరివెంకట కుమారి మాట్లాడుతూ నగరం శరవేగంగా విస్తరిస్తోందన్నారు. జివిఎంసి ద్వారా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఇక్కడి సౌకర్యాలు, ప్రశాంతమైన వాతావరణం కారణంగా ఉద్యోగ విరమణ పొందిన వ్యక్తులు ఇక్కడ స్థిరపడాలని కోరుకుంటారని అన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ అధ్యక్షుడు ధర్మేందర్ వరద మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పోలో 96 స్టాల్స్‌లో 300కు పైగా నిర్మాణాలను అమ్మకందారులు కొనుగోలుదారులకు అందుబాటులో ఉంచారన్నారు. ఇక్కడ ప్లాట్లు బుక్ చేసుకున్న వారికి ప్రత్యేక తగ్గింపు అందిస్తున్నామని, బ్యాంకు రుణ సదుపాయాన్ని కుడా ఇక్కడే పొందేలా ఏర్పాట్లు చేసామని తెలిపారు. ఎస్‌బిఐ డిజిఎం పంకజ్ రాయ్ గృహ కొనుగోలుదారులకు అందుబాటులో ఉన్న వివిధ రుణ ఎంపికలు, బ్యాంకు అందించే ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ కెఎస్ఆర్‌కె.రాజు (సాయి), ఎక్స్‌పో గౌరవ కార్యదర్శి కన్వీనర్ వి.శ్రీను, క్రెడాయ్ ఎపి ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు, క్రెడాయి విశాఖపట్నం అధ్యక్షులు వి.ధర్మేందర్, ఉపాధ్యక్షులు సిహెచ్.గోవింద్ రాజు, సంయుక్త కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.నరసింహారావు, కమిటీ సభ్యులు ఎం.కృష్ణ మోహన్ రావు, శంక పవన్ పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోండి

మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం, వెంకట నగరం పంచాయతీ సముద్రతీరంలో కాకినాడ సెజ్ పరిశ్రమల వ్యర్థ రసాయనాల విడుదలకు పైపులైన్ నిర్మించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు శనివారం లేఖ రాశారు. పాయకరావుపేట మండలం, వెంకటనగరం పంచాయతీలోని వెంకటనగరం, రాజానగరంలో 4500 మంది మత్స్యకారులున్నారని తెలిపారు. వెంకటనగరంలో 96 బోట్లు, రాజా నగరంలో 58 బోట్లు ఉన్నాయన్నారు. 1540 మంది సముద్రంలో చేపల వేటాడి బతుకుతున్నారని తెలిపారు. ఇప్పటికే డెక్కన్ కంపెనీ సముద్రంలోకి విడిచిపెడుతున్న వ్యర్థ రసాయనాలు వల్ల చేపల ఉత్పత్తి తగ్గిందని తెలిపారు. సముద్రంలో చేపలు దొరక్క బతుకు దెరువు కోసం మత్స్యకారులు వలసలు పోతున్నారని తెలిపారు. దొరికిన చేపలు కూడా రసాయనాల వాసన రావడంతో అమ్ముకోవడం కష్టంగా ఉందన్నారు. ఏళ్ల తరబడి ఈ ఇబ్బందులు పడుతుండగానే మరోవైపు కొత్తగా 20 కిలోమీటర్లకుపైగా ఉన్న కాకినాడ సెజ్ పరిశ్రమల వ్యర్థాలు విడిచిపెట్టేందుకు పాయకరావుపేట మండలం వెంకటనగరం సముద్ర తీరంలో పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. ఇక్కడ వ్యర్థాలు సముద్రంలో విడిచిపెడితే వెంకటనగరం, రాజానగరం మత్స్యకారుల ఉపాధి పూర్తిగా దెబ్బతింటుందని తెలిపారు. ఊర్లో బతకలేక వలసలు పోవాల్సిన దుస్థితి ఏర్పడనుందని పేర్కొన్నారు. హేచరీస్ యజమానుల ఒత్తిళ్లతో కాకినాడ సెజ్‌కు రెండు కిలోమీటర్ల దూరంలోని సముద్ర తీరంలో పైపులైన్ నిర్మించకుండా 20 కిలోమీటర్ల దూరంలోని వెంకటనగరం తీరంలో విడిచిపెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఇది ఎంత మాత్రమూ సరికాదని తెలిపారు. పైపులైన్ నిర్మాణానికి పంచాయతీ అనుమతి లేదన్నారు.

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జిఎ.నారాయణరావు అన్నారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా, విభజన హామీలు, రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక రాయితీలు వంటి అంశాలు మరుగున పడిపోవడం అన్యాయమని అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంటు శీతాకాల సమావేశాల సమయంలో తాము ఢిల్లీ వెళ్లి ప్రధాన రాజకీయ పార్టీల నాయకులను, ఇతర పార్లమెంటు ఫ్లోర్ లీడర్లను కలిసి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చేలా కృషి చేయాలని కోరామన్నారు. జాతీయ నాయకులు ఇచ్చిన సూచన మేరకు తమ పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా సాధన కోసం పోరాట కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఫిబ్రవరిలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తామన్నారు. అనంతరం విశాఖలో పది వేల మందితో బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు.

దాసోహం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పాలక, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కళ్లుండీ చూడలేని, చెవులుండీ వినలేని కబోధుల వలే ప్రవర్తిస్తున్నాయి. జిత్తుల మారి ఎత్తులు వేస్తూ మోడీ భజనలో తమ బాధ్యతలను మర్చిపోతున్నాయి. లేదు..లేదు దాసోహమవుతున్నాయి. అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్ష టిడిపి, మిత్రపార్టీ జనసేనకు ఏ మాత్రం ఆత్మగౌరవం, ఆత్మాభిమానమున్నా తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు ప్రయత్నాలు, కుట్రలను అడ్డుకోవడానికి కనీస ప్రయత్నమైనా చేసేవి. స్టీల్‌ప్లాంట్‌ను ముక్కముక్కలుగా జిందాల్ వంటి ప్రయివేటు సంస్థల చేతుల్లో పెడుతున్నా, ఇది తప్పు అని చెప్పే ధైర్యంలేక వైసిపి, టిడిపి, జనసేన మోడీ ముందు మోకరిల్లుతున్నాయి. బ్లాస్ట్‌ఫర్నేస్-3 నడపడానికి జిందాల్‌తో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేసుకున్న రహస్య ఒప్పందం బయటపెట్టమనడానికి కూడా ఈ పార్టీలకు నోరు రాలేదు. ఈ మౌనం స్టీల్‌ప్లాంట్‌ను ఎలాగైనా అమ్మాలని చూస్తున్న మోడీకి వెనుక నుంచి ఈ మూడు పార్టీలు అందిస్తున్న సహకారంగానే భావించాలి. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా వెయ్యి రోజులకు పైగా కార్మికులు పట్టుదలతో పోరాటం సాగిస్తున్నారు. కార్మికుల పోరాటానికి నైతిక మద్దతు, బలం ఇవ్వాల్సిన పార్టీలు బిజెపి పంచన చేరడానికే పోటీపడుతున్నాయి. చరిత్రలో చేసిన తప్పిదాలను సరిదిద్దుకొనే క్రమంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, సొంత గనులు సాధనకు ముందుకువస్తే కొంతైనా గౌరవం దక్కేది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పార్టీలకతీతంగా పోరాడుదామని సిపిఎం ఏనాడో సహేతుకమైన పిలుపునిచ్చింది. సూచన చేసింది. అయినా ప్రధాన పార్టీల్లో కనీస కదలిక లేదు. మోడీ కుట్రలు, కుతంత్రాలిక్కడ సాగనివ్వబోమని పార్టీలన్నీ కలిసి దండెత్తితే స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి మోడీ సాహసించేవారా ? సొంత గనులు కేటాయించకుండా వుండేవారా ? బ్లాస్ట్‌ఫర్నేస్-3ను మూయించి, తరువాత తెరవడానికి జిందాల్‌తో రహస్య ఒప్పందం చేసుకొనే ప్రక్రియ సాగేదా ?. స్టీల్‌ప్లాంట్ సాధన స్ఫూర్తితో రాజకీయ పార్టీలన్నీ ఏకోన్ముఖంగా కదిలితే స్టీల్‌ప్లాంట్‌కు ఈ దుర్గతి పట్టేదికాదు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై యువగళం ముగింపు సభలో కనీసం మాట్లాడలేదు. అధికార వైసిపి నోరెందుకు విప్పడంలేదో ప్రజలు ప్రశ్నించాలి.

తెలంగాణా కంటే ఎక్కువ జీతం ఇస్తానని ఎన్నికల్లో చెప్పిన మాట నిలబెట్టుకోవాల్సిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, అందుకు విరుద్ధంగా అంగన్‌వాడీలను భయపెడుతున్నారు. పేద కుటుంబాల పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా, అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం గుర్రాలతో తొక్కించినా వెనుకడుగు వేయకుండా ఐక్యంగా పోరాడిన అంగన్‌వాడీల ధైర్య,సాహసాలను ఈ ప్రభుత్వం తెలుసుకొని సమ్మెపై నిర్బంధం ప్రయోగించకుండా, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి. 2017 నుంచి బకాయిపడ్డ టిఎ, డిఎ చెల్లించాలని, ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం, గ్రాట్యూటీ, పదవీ విరమణ సదుపాయాలు, ప్రభుత్వ పథకాలు అమలుచేయాలని చేస్తున్న సమ్మె చాలా సముచితమైనది. అందుకే ప్రజలు మద్దతు వీరికి పెరుగుతోంది. ఎస్-ఎస్ఎలో వివిధ కేటగిరీల కింద పనిచేస్తున్న ఉద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం రెగ్యులర్ చేయకపోవడంతో అనివార్యంగా వారుకూడా సమ్మెలో దిగారు. రెగ్యులర్ చేసేవరకు మినిమం టైం స్కేల్ సహా ఇతర సదుపాయాలు అమలు చేయాలి. స్కీం వర్కర్లు, వివిధ ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా వ్యవహరించకపోతే భవిష్యత్‌తో ప్రతికూల ఫలితాలు చూడాల్సి వస్తుందని ప్రభుత్వం గ్రహిస్తే మంచిది.

డాక్ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అనసూయ

డాక్ సేవా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కూనవరం : మండల కేంద్రం టేకులబోరులో 'డాక్ సేవా కేంద్రాన్ని' కూనవరం మండల తహసీల్దారు అనసూయ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ మేల్ ఓవర్సీర్ బి.కృష్ణనాయక్ మాట్లాడుతూ తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రయివేటు వ్యక్తులు నిర్వహించే ఈ డాక్ సేవా కేంద్రం ద్వారా రిజిస్టర్ ఉత్తరాలు, పార్సిల్ బుకింగ్ సహా వివిధ ఇండియా పోస్ట్ సేవలను పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులకు త్వరితగతిన సేవలను అందించడం కోసం దీనిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డాక్ సేవా కేంద్రాలను తపాలా కార్యాలయానికి అనుబంధంగా ఉండేలా తపాలా శాఖ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డాక్ సేవా కేంద్రాల ద్వారా తపాల సేవలతో పాటు తపాలా జీవిత బీమా, ఐపీబీపీ తదితర సేవలను వినియోగదారులు పొందవచ్చుని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కూనవరం మండల అధ్యక్షుడు దాసరి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'డాల్ఫిన్' కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలోని డాల్ఫిన్ హోటల్‌లో తొలగించిన దళిత కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. కెవిపిఎస్ ఆధ్వర్యంలో శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో దళిత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అంబేద్కర్ సొసైటీ నాయకులు బొడ్డు కల్యాణరావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ మాట్లాడుతూ వాష్ పెంట్రీ బాయ్ సత్యంను కులం పేరుతో దూషించిన సూపర్‌వైజర్‌కు శిక్ష పడకుండా యాజమాన్యం కాపాడిందని తెలిపారు. ఈ చర్య ద్వారా కుల వివక్షతకు యాజమాన్యం పాల్పడిందని చెప్పారు. సూపర్‌వైజర్ చర్యలకు వ్యతిరేకంగా 32 మంది యాజమాన్యానికి ఫిర్యాదు చేశారని, వారి నాలుగు రోజుల వేతనాలను యాజమాన్యం కట్ చేసిందని అన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై కార్మిక శాఖకు కెవిపిఎస్ ఫిర్యాదు చేయగా కార్మికులకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. దాన్ని అమలు చేయకుండా డాల్ఫిన్ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించిందని తెలిపారు. హైకోర్టు కూడా స్పందించి దిగువ కోర్టు ఇచ్చిన సూచనలను పాటించాలని పేర్కొందని తెలిపారు. అయితే యాజమాన్యం అందుకు సిద్ధపడకుండా సుప్రీంకోర్టుకు వెళ్లడం దుర్మార్గమన్నారు. అంతేకాకుండా వాష్ పెంట్రీ బాయ్ సత్యంను రాజీనామా చేయించి, తప్పుడు సాక్ష్యం కోర్టులో చెప్పి సూపర్‌వైజర్‌ను యాజమాన్యం రక్షించిందని విమర్శించారు. ఇప్పటికైనా యాజమాన్యం అక్రమంగా తొలగించిన దళిత కార్మికులను విధుల్లోకి అనుమతించాలన్నారు. డాల్ఫిన్ యాజమాన్యం కుల వివక్షతను విడనాడాలని డిమాండ్ చేశారు. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తే డాల్ఫిన్ హోటల్ ఎదుట అన్ని దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. వేద పండితులు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని భక్తుల ఆలయంలో ప్రవేశించేందుకు ఉత్తర ద్వారం తెరిచారు.

మద్య నిషేధం మరిచిన జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జగన్మోహన్ రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం దక్షిణ నియోజవర్గం చావుల మదుం జంక్షన్‌లో మహిళా సమాఖ్య, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్న మద్యపానాన్ని దశలవారీగా నిషేదిస్తామన్న ముఖ్యమంత్రి తన హామీని నిలుపుకోవాలని నినాదాలు చేశారు.